
సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023

కూడళ్లు సరికొత్తగా..



పట్టణ సుందరీకరణలో భాగంగా నాలుగు జంక్షన్లను ఆధునీకీకరిస్తున్నారు. రూ.4కోట్లతో పనులు చేపట్టగా.. పూర్తయితే మంచిర్యాల రూపురేఖలు మారిపోనున్నాయి.

9లో▸



అడవి శిలాజాన్ని ఆదరించరూ

అరుదైన వృక్ష శిలాజాలపై పట్టింపు కరువైంది. ప్రాణహిత తీరంలో డైనోసర్ జాడలు గుర్తించారు. వేల ఏళ్ల నాటి తాబేళ్లు, నత్తగూళ్లు, చేపల అవశేషాలు నేటికీ కనిపిస్తున్నాయి. 10లో▸

గరిష్టం/కనిష్టం
41.0 /27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. వాయువ్యం దిశగా వేడిగాలులు వీస్తాయి.



న్యూస్‌రీల్

అక్రమ పట్టాలు బ్లాక్ చేసిన కలెక్టర్

సాక్షి ఎఫెక్ట్..

జన్నారం: మండలంలో అక్రమ పట్టాలపై కలెక్టర్ కొరడా ఝులిపించారు. పలు అక్రమ పట్టాలను బ్లాక్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 19న 'వెలుగులోకి మరో అక్రమ పట్టా' అనే శీర్షికన 'సాక్షి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించి విచారణ చేశారు. 'సాక్షి' కథనాన్ని జోడించి, విచారణ నివేదికను కలెక్టర్‌కు పంపించారు. అధికారుల నివేదిక ప్రకారం జన్నారం మండలం కిష్టాపూర్ గ్రామ శివారులోని సర్వేనంబర్ 139/అ1/1లోని 2 ఎకరాల భూమిని అక్రమ పట్టాగా నిర్ధారించి ధరణిలో బ్లాక్ చేస్తూ కలెక్టర్ సంతోష్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తహసీల్దార్ కిషన్ తెలిపారు. సింగరాయిపేట గ్రామ శివారులో 147/6 సర్వే నంబర్‌లో 5 ఎకరాల భూమి, 147/11 సర్వే నంబర్‌లో 2.20 ఎకరాల భూమిని కూడా ధరణిలో బ్లాక్‌లో పెట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలిపారు.

విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 14న హైదరాబాద్‌లో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం విజయవంతానికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, ట్రైనీ కలెక్టర్ పి.గౌతమి, జెడ్పీ సీఈవో నరేందర్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావుతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గానికి 300 మంది చొప్పున జిల్లాలోని మూడు నియోజకవర్గాల నుంచి 900 మంది తరలిస్తామని తెలిపారు. 14న ఉదయాన్నే బస్సులు బయల్దేరాలని, ప్రయాణించే వారి కోసం తాగునీరు, అల్పాహారం, భోజన వసతి కల్పించాలని, వేసవికాలం దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని, ప్రతీ బస్సుకు లైజన్ అధికారి, పోలీస్ కానిస్టేబుల్, సహాయ అధికారిని నియమించామని, బస్సులో ప్రయాణించే వారి పూర్తి వివరాలు అధికారి వద్ద తప్పనిసరిగా ఉండాలని తెలిపారు.

'పది' మూల్యాంకనం షురూ



స్పాట్‌కు తరలివచ్చిన ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి పరీక్షలు ముగియడంతో నిర్ణీత సమయంలో ఫలితాలు వెల్లడించేందుకు స్పాట్ వాల్యూయేషన్ మొదలైంది. గురువారం జిల్లాలో మొదటిసారిగా స్థానిక కార్మెల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన స్పాట్ వాల్యూయేషన్(మూల్యాంకన కేంద్రం)ను క్యాంపు ఆఫీసర్ డీఈవో వెంకటేశ్వర్లు ప్రారంభించారు. తొమ్మిది రోజులపాటు సాగే శిబిరానికి ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో కోలాహలం నెలకొంది. కుమురంభీం, మంచిర్యాల జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు ఉదయం 9గంటల నుంచి రిలీవ్ సర్టిఫికేట్లతో క్యాంపు అధికారికి రిపోర్టు చేశారు. అంతకుముందు విధులకు సంబంధించిన నియమ, నిబంధనలను సంబంధిత అధికారులు సూచించారు. మూల్యాంకానికి 1,69,127 పేపర్లు వచ్చినట్లు వెల్లడించారు. సబ్జెక్టుల వారీగా తెలుగు 38, హిందీ 63, ఇంగ్లిష్ 60, గణితం 81, భౌతికశాస్త్రం 70, జీవశాస్త్రం 69, సాంఘిక శాస్త్రం 124 మంది టీచర్లు రిపోర్టు చేశారు.

తలంబ్రాల బుకింగ్‌లో ఫస్ట్

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల డిపో ఆవరణలో లాజిస్టిక్(కార్గో) కేంద్రం సీతారాముల కల్యాణ తలంబ్రాల బుకింగ్‌లో కరీంనగర్ జోన్‌లో మొదటిస్థానం సాధించినట్లు డిపో మేనేజర్ రవీంద్రనాథ్ తెలిపారు. 38 డిపోల పరిధిలో 2,457 తలంబ్రాల బుకింగ్‌తో రూ.2,85,012 ఆదాయం సమకూరిందని తెలిపారు. రూ.116 చెల్లించి బుకింగ్ చేసుకున్న భక్తులందరికీ సీతారాముల తలంబ్రాలను పంపిణీ చేశామని పేర్కొన్నారు. కరీంనగర్ జోన్‌లో మొదటి స్థానానికి కృషి చేసిన కార్గో సిబ్బందిని అభినందించారు.

నేడే సత్యాగ్రహ సభ



బహిరంగ సభ ఏర్పాట్లు

- కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభ
- నస్పూర్‌లో సాయంత్రం 4గంటలకు షురూ
- ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే
- లక్షమందితో సభ సక్సెస్ చేసేలా నాయకుల ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో శుక్రవారం తలపెట్టిన 'సత్యాగ్రహ సభ'కు సర్వం సిద్ధమైంది. కొత్త కలెక్టరేట్ సమీపంలోని 22 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు ఖాళీ స్థలంలో సభ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసింది. జాతీయ స్థాయి నాయకులు తరలివస్తుండడంతో మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం 4గంటల నుంచి సభా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. యుద్ధనౌక గద్దర్ నేతృత్వంలో ఆటాపాట, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హాజరవుతుండడంతో రాష్ట్ర, జిల్లా నేతలు మరింత ప్రతిష్టాత్మకంగా తీసుకుని జన సమీకరణ చేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది నియోజకవర్గాలతోపాటు పెద్దపల్లి, భూపాలపల్లి, జగిత్యాల జిల్లాల నుంచి అత్యధికంగా జనం హాజరయ్యేలా రెండ్రోజుల నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తంగా సభకు లక్ష మంది హాజరవుతారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

భారీగా ఏర్పాట్లు

1800 అడుగుల విస్తీర్ణంలో సభా వేదికతోపాటు ముఖ్య అతిథి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కతో సహా వర్కింగ్ ప్రెసిడెంట్లు, మాజీ మంత్రులు, రాష్ట్రంలోని సీనియర్ నాయకులు వేదికపై కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. వేసవి దృష్ట్యా టెంట్లు వేశారు. తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. మహిళలకు తాత్కాలిక మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించారు. సభ నేపథ్యంలో మంచిర్యాల–నస్పూర్ ప్రధాన రహదారి, కొత్త కలెక్టరేట్ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. వీఐపీ, వీవీఐపీలకు ప్రత్యేక ఏర్పాట్లు, చలువ పందిళ్లు, పార్కింగ్ సదుపాయాలు, ఎల్ఈడీ తెరలు సిద్ధం చేశారు.

సభా ప్రాంగణానికి అంబేద్కర్ పేరు

రాజ్యాంగం రచించిన అంబేద్కర్ జయంతి రోజే సభ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ సభా ప్రాంగణానికి బాబా సాహెబ్ అంబేద్కర్ వేదికగా నామకరణం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్‌గాంధీకి మద్దతుగా నిర్వహిస్తున్న నేపథ్యంలో జాతీయ స్థాయిలో ఈ సభతో తమ నిరసన తెలుపుతామని పార్టీ నాయకులు చెబుతున్నారు.

17చోట్ల భోజన వసతి

సభకు వచ్చే వారికి భోజనాలకు ఇబ్బంది లేకుండా సభ వెలుపలే 17చోట్ల ఏర్పాట్లు చేశారు. ఎస్పీఆర్ ఫంక్షన్ హాల్, ఎంవీఆర్ ఫంక్షన్ హాల్ దొనబండ, పద్మావతి గార్డెన్, వైశ్యభవన్ మంచిర్యాల బైపాస్ రోడ్డు, లారీ అసోసియేషన్, పటేల్ గార్డెన్ హమాలీవాడలోని ప్రభుత్వ పాఠశాల మైదానం, లయన్స్‌క్లబ్, తాపీ భవనం రసూల్‌పల్లి, ఎంఎస్ఆర్ గార్డెన్, ఎస్కేఆర్ గార్డెన్, సింగరేణి ఫంక్షన్ హాల్, ఇందిరమ్మ ఫ్లడ్ కాలనీ, పటేల్ నగర్‌లో భోజనాలు ఏర్పాటు చేశారు.

పాదయాత్రగా వెళ్లిన 'భట్టి'

నస్పూర్ ప్రాంతానికి సీఎల్పీ నేత విక్రమార్క గురువారం సాయంత్రం శ్రీరాంపూర్ ప్రగతి మైదానం నుంచి నస్పూర్ మున్సిపాలిటీ పెట్రోల్‌బంక్ వరకు పాదయాత్ర చేశారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వీహెచ్, సంపత్ పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

నస్పూర్: నస్పూర్‌లో బహిరంగ సభ ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. సభ ఏర్పాట్లపై డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖను అడిగి తెలసుకున్నారు. సభ ఏర్పాట్లపై ఆయన నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్‌చౌదరి, సంపత్‌కుమార్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రచార కమిటీ కన్వీనర్ అజ్మతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

'భట్టి' పాదయాత్రకు సంఘీభావం



శ్రీరాంపూర్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్న భట్టి విక్రమార్క, మాణిక్‌రావు ఠాక్రే, వీహెచ్

నస్పూర్: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క మూడు రోజుల విరామం తర్వాత గురువారం సాయంత్రం శ్రీరాంపూర్‌లోని ప్రగతి స్టేడియం నుంచి పీపుల్స్‌మార్చ్ ప్రాదయాత్ర చేపట్టారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్‌చౌదరి, సంపత్‌కుమార్, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, పీసీసీ మాజీ అధ్యక్షుడు వీ.హన్మంతరావు పాదయాత్రకు సంఘీభావంగా పాల్గొన్నారు. శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద సింగరేణి కార్మికుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రజలను పలుకరిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. మహిళలు రోడ్డు వెంట పాదయాత్రకు మంగళహారతులతో స్వాగతం పలికారు. పాదయాత్ర విలేజ్ శ్రీరాంపూర్ మీదుగా సీసీసీ కార్నర్ వద్దకు చేరుకుంది. సీసీసీ కార్నర్ వద్ద బస చేస్తారు. శుక్రవారం పాదయాత్రగా భారీ బహిరంగ సభకు చేరుకుంటారు. మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలి

- నెలాఖరులోగా సీఎంఆర్ పూర్తి చేయాలి
- కలెక్టర్ బాదావత్ సంతోష్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో రైస్‌మిల్లర్లకు కేటాయించిన నిర్దేశిత లక్ష్యాలను అధికారులు సమన్వయంతో సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్‌తో కలిసి జిల్లా పౌరసరఫరాల, వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు, ఏజెన్సీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ రైస్‌మిల్లర్లకు కేటాయించిన సీఎంఆర్ పెండింగ్ ఉన్న 24వేల టన్నుల లక్ష్యాన్ని ఈ నెల 30లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతీ రోజు 14మెట్రిక్‌టన్నుల చొప్పున పూర్తి చేస్తేనే లక్ష్యాన్ని నిర్ణీత గడువులోగా సాధిస్తారని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని అన్నారు. విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్, ప్రత్యేక బృందాలు వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని, రైస్‌మిల్లులలో కొనసాగుతున్న పనులను పర్యవేక్షించి లక్ష్యాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు దళారుల బారిన పడి మోసపోకుండా ప్రభుత్వమే మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలపై టోల్ ఫ్రీ నంబరు 1967 /180042500333 సంప్రదించాలని తెలిపారు.

ధాన్యం సేకరణ లక్ష్యం 2.20 లక్షల టన్నులు

జిల్లాలో 250 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ద్వారా 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు లక్ష్యాలను నిర్దేశించినట్లు కలెక్టర్ సంతోష్ తెలిపారు. ఇంటర్మీడియెట్ గోదాముల్లోని వరిధాన్యాన్ని మిల్లర్లు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. నిబంధనల మేరకు పక్క జిల్లాలకు తరలించి లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ వసతి కల్పించాలని, వేసవి దృష్ట్యా వృద్ధులకు ప్రాధాన్యత కల్పించాలని తెలిపారు. అనంతరం వరి ధాన్యం మద్దతు ధర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్, జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఠాణా నిర్వహణకు నిధుల్లేవు..!

- పోలీసుస్టేషన్లకు స్టేషనరి బిల్లులు రాక ఇబ్బందులు
- 11నెలలుగా పెండింగ్..
- జిల్లాకు రావాల్సింది రూ.93.50లక్షలు



మంచిర్యాల పోలీస్‌స్టేషన్

మంచిర్యాలక్రైం: ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత ప్రభుత్వం పోలీసుశాఖకు పెద్దపీట వేసింది. ఫలితంగా పోలీసు శాఖ స్వరూపమే మారింది. ఖరీదైన వాహనాలు, ఏసీ కార్లు, ద్విచక్ర వాహనాలు అందజేసింది. వీటితోపాటు ఠాణాల నిర్వహణకు స్టేషనరి బిల్లు కింద మండల పరిధిలోని పోలీసుస్టేషన్లకు రూ.25వేలు, మున్సిపల్ పరిధిలో రూ.50వేలు అందజేస్తోంది. ప్రారంభంలో ప్రతీ నెల డబ్బులు వచ్చేవి.. రాను రాను మూడు నెలలకోసారి ఇచ్చారు. ఇది కాస్త 11 నెలల నుంచి స్టేషనరి బిల్లులు రావడం లేదు. దీంతో స్టేషన్ల నిర్వహణ అధికారుల(ఎస్‌హెచ్‌వో)లకు భారం తడిసి మోపెడవుతోంది. 2022 జూన్ వరకు నిర్వహణ బిల్లులు వచ్చాయి. అప్పటి నుంచి సుమారు 11నెలలుగా ప్రభుత్వం నుంచి క్లియరెన్స్ రాలేదు. కొందరు అధికారులు తమ జీతాన్ని నిర్వహణ ఖర్చులకు వినియోగిస్తున్నారు. ఇంకొందరు ఠాణాలో సిబ్బంది తలా కొంత ఖర్చు చేసి బిల్లు ఎప్పుడు మంజూరవుతుందోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. సకాలంలో బిల్లులు రాకపోవడంతో అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం సిబ్బంది పనితీరుపై ప్రభావం చూపుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జిల్లాలో..

జిల్లాలో 26పోలీసుస్టేషన్లు ఉన్నాయి. నెలవారీగా నిర్వహణ నిమిత్తం మండల పరిధిలో రూ.25వేలు, మున్సిపల్ పరిధిలో రూ.50వేలు అందజేయాల్సి ఉంది. జిల్లాలో మండల పరిధిలో 18 స్టేషన్లు ఉండగా.. ఒక్కో స్టేషన్‌కు రూ.25వేల చొప్పున 11 నెలలకు రూ.49.50లక్షలు రావాల్సి ఉంది. మున్సిపల్ పరిధిలో ఎనిమిది స్టేషన్లకు గాను రూ.50వేల చొప్పున 11నెలలకు రూ.44లక్షలు రావాల్సి ఉంది. మొత్తంగా 26 స్టేషన్లకు గాను రూ.93.50లక్షలు పెండింగ్ ఉన్నాయి. ప్రతీ మూడు నెలలకు ఒకసారి ఠాణాలకు సంబంధించిన నిర్వహణ ఖర్చుల వివరాలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తే అందుబాటులో ఉన్న నిధులతో నెల, లేదంటే రెండు మూడు నెలలకోసారి మంజూరు చేస్తుంది. గత ఏడాది జూన్ నుంచి ఇప్పటివరకు ఒక్క నెల నిర్వహణ ఖర్చులు సైతం మంజూరు కాకపోవడంతో స్టేషన్ల నిర్వహణ ఎస్‌హెచ్‌వోలకు భారంగా మారింది. రోజువారీ విధి నిర్వహణలో అవసరమయ్యే స్టేషనరి జిరాక్స్ సెంటర్లు, పేపర్లు, పిన్స్, ఇతర రాష్ట్రాల నిందితులను పట్టుకునేందుకు బృందాలు వెళ్లేందుకు, అక్కడ బసకు, బస్సుల్లో రవాణాకు సిబ్బంది తమ సొంత డబ్బులు వెచ్చించాల్సి వస్తోంది. గుర్తు తెలియని మృతదేహాలు లభించిన సందర్భాల్లోనూ ఖర్చులకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో నిందితులకు ఆహారం ఇవ్వాలన్నా ఇబ్బందిగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విచారణ తీరుపై ప్రభావం

పోలీస్‌స్టేషన్లకు రోజు వివిధ కేసులు వస్తుంటాయి. వాటి విచారణ కోసం పోలీస్ అధికా రులు వెళ్లాల్సి ఉంటుంది. కొన్ని కేసుల్లో దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. అరెస్ట్ చేసిన నిందితులను లాకప్‌లో ఉంచిన సందర్భాల్లో ఆహారం అందించాల్సి ఉంటుంది. ఇలా పో లీస్‌స్టేషన్లలో నిత్యకృత్యంగా ఉండే కేసులతో వివిధ రూపాల్లో నిర్వహణ ఖర్చు అవుతోంది. స్టేషన్ల నిర్వహణకు ఉపయోగించే డబ్బులు రాకపోవడంతో ఎస్‌హెచ్‌వోలకు తలనొప్పిగా మారింది. దీంతో కొన్ని కేసుల్లో విచారణ తీరుపై ప్రభావం చూపుతుందని పలువురు అధికారులు చర్చించుకోవడం గమనార్హం.

'పేదలను మోసం చేసిన కాంగ్రెస్'



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: జిల్లా ప్రజలను గత పాలనలో కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని, దొంగ పట్టాలతో పేదలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాహుల్‌గాంధీ ఎంపీ సభ్యత్వం రద్దుపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రధాని నరేంద్రమోదీపై చేస్తున్న వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అన్నారు. సత్యాగ్రహ దీక్షతో మంచిర్యాలకు వస్తున్న కాంగ్రెస్ నాయకులు జిల్లాలోని పేదలు, రైతులు, ఎల్లంపల్లి భూ నిర్వాసితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పటి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, ఎమ్మెల్సీగా ఉన్న కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు మెగా కంపెనీతో కుమ్మక్కై ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నాసిరకం పైపులు వేయించారని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు రజనీష్‌జైన్, రేకందర్ వాణి, గాజుల ప్రభాకర్, జోగుల శ్రీదేవి, బొద్దున మల్లేశ్, పూదరి ప్రభాకర్, ముదాం మల్లేశ్, బోయిని దేవేందర్, తిప్పని భీమయ్య, గుర్రాల లావణ్య పాల్గొన్నారు.

16న కవి సమ్మేళనం

మంచిర్యాలటౌన్: భారత్ జాగృతి ఆధ్వర్యంలో ఈ నెల 16న కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు జాగృతి జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి ప్రేమ్‌రావు, సాహిత్యం విభాగం జిల్లా అధ్యక్షుడు దుర్గం రాజేశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా, 125 మంది కవులకు సన్మానం చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని కవులు, సాహితీ వేత్తలు ఆ రోజు ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహించే కవి సమ్మేళనానికి హాజరు కావాలని కోరారు. కవి సమ్మేళనంలో పాల్గొనే కవులు, రచయితలు 9652072505, 9701781696 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్
- క్యాతనపల్లిలో రంజాన్ తోఫా పంపిణీ



తోఫా పంపిణీ చేస్తున్న విప్ బాల్క సుమన్

రామకృష్ణాపూర్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో గురువారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమానంగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అన్నారు. పేద ముస్లిం మహిళల పెళ్లికి రూ.లక్షా116 సాయం అందిస్తున్నామని అన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని ఈద్గాలు, దర్గాలు అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, కమిషనర్ వెంకటనారాయణ, బీఆర్ఎస్ నాయకులు అబ్దుల్ అజీజ్, గాండ్ల సమ్మయ్య, యాకూబ్‌అలీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం క్యాతనపల్లిలోని 20వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని బాల్క సుమన్ పరిశీలించారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

రామకృష్ణాపూర్: చెన్నూర్, జైపూర్ మండలాల్లోని అభివృద్ధి పనులపై ప్రభుత్వ విప్ బాల్క సుమన్ సమీక్షించారు. క్యాతనపల్లిలోని తన నివాసంలో గురువారం ఆయా మండలాల తహసీల్దార్, ఎంపీడీవోలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సమ్మక్క–సారలమ్మ మహిళా భవనాలు, కేసీఆర్ గ్రంథాలయాలకు స్థల సేకరణ పూర్తిచేయాలని, వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలని ఆదేశించారు. పల్లె ప్రకృతివనం, ఓపెన్‌జిమ్స్, తాగునీరు, అంతర్గత రోడ్లు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ఇళ్ల మధ్య వేలాడే విద్యుత్ తీగలు, స్తంభాలను సరిచేసేలా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. జీవో నెంబరు 76లో భాగంగా రామకృష్ణాపూర్‌లో ఇళ్ల పట్టాలకు అందరూ దరఖాస్తు చేసుకునేలా చూడాలని తహసీల్దార్‌కు సూచించారు.

ఆ పార్టీలు గెలిస్తే సంక్షేమ పథకాలు ఉండవు

- మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు



సమ్మేళనంలో మాట్లాడుతున్న లక్ష్మణ్‌రావు

కాసిపేట: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు గెలిస్తే సంక్షేమ పథకాలు ఉండవని మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు అన్నారు. గురువారం మండలంలోని ముత్యంపల్లి గ్రామంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. పింఛన్, రైతుబంధు, కేసీఆర్‌కిట్లు, రైతుబీమా, ఉచిత విద్యుత్, దళితబంధు వంటి అనేక పథకాలు సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతు అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఎంపీపీ రోడ్డ లక్ష్మి, జెడ్పీటీసీ చంద్రయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, వైస్ ఎంపీపీ విక్రంరావు, తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఆగాచారి

మంచిర్యాలఅర్బన్: వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోళ్ల రామన్న అన్నారు. గురువారం టీఎస్‌యూటీఎఫ్ 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా పూర్వ అధ్యక్షుడు ఆగాచారి టీఎస్‌యూటీఎఫ్ ఉద్యమ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీలపై హైకోర్టులో నడుస్తున్న కేసు వాయిదాను ముందుకు జరిపే విధంగా విద్యాశాఖ అధికారులు ప్రయత్నాలు చేయాలని, తద్వారా వేసవి సెలవుల్లోనే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని అన్నారు. పాఠశాలల్లో ఖాళీల వల్ల విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి రాజావేణు, కార్యదర్శి కిరణ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు బారిక్‌రావు, రవికుమార్, దుర్గయ్య, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య



పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన తిరుపతి(38) మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. వివరాల ప్రకారం... తిరుపతి భార్య గత కొద్ది రోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురై అతిగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైన్స్‌లో దొంగతనం కేసులో మరొకరి రిమాండ్

కాసిపేట: ఆర్ఎస్ వైన్స్‌లో గత నెల 19న సీసీ కెమెరాలు ధ్వంసం చేసి, షట్టర్లు పగలగొట్టి దొంగతనం చేసిన కేసులో కరీంనగర్ జిల్లా వావిలాలపల్లికి చెందిన ఎండీ గౌస్‌పాషాను గురువారం రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. మార్చి 19న జరిగిన దొంగతనం కేసులో ముగ్గురు నిందితుల్లో ఈ నెల 3న మహ్మద్ షమీర్, అబ్దుల్ షాకీబ్‌ను ఇప్పటికే రిమాండ్ చేశామన్నారు. పరారీలో ఉన్న గౌస్‌పాషా గురువారం సోమగూడెంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టుకున్నామని తెలిపారు. విచారణలో మరో చోరీకి రెక్కీ నిర్వహించేందుకు వచ్చినట్లు ఒప్పుకోవడంతో రిమాండ్‌కు తరలించామని వెల్లడించారు.

బెల్లంపల్లిలో మరో ఐదుగురికి కరోనా

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రాంతంలో కరోనా మళ్లీ విజృంభిస్తోంది. గురువారం బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అనుమానితులు పరీక్షించుకోగా ఐదుగురికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. 18 మందికి పరీక్షలు చేసినట్లు ఆసుపత్రి వర్గాలు ప్రకటించాయి. ఇందులో బెల్లంపల్లి బజారు ఏరియా ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తితో పాటు గంగారం నగర్ చెందిన ఒకరికి, తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్‌లో ఒకరికి, కాసిపేట మండల కేంద్రానికి చెందిన ఇద్దరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. బుధవారం బెల్లంపల్లిలో ముగ్గురికి కరోనా సోకిన విషయం తెలిసిందే.

వీడిన హత్య కేసు మిస్టరీ

- భూ వివాదమే కారణం..
- పథకం ప్రకారమే రియల్ వ్యాపారి హత్య
- ఇద్దరు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీసీపీ



నిందితుల అరెస్టు చూపుతున్న డీసీపీ, ఇతర అధికారులు

రామకృష్ణాపూర్: రియల్ ఎస్టేట్ వ్యాపారి నడిపెల్లి లక్ష్మీకాంతరావును హత్యచేసిన నిందితులను పోలీసులు పట్టుకున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ రాంనాథ్ కెకాన్ వివరాలు వెల్లడించాడు. మంచిర్యాలకు చెందిన లక్ష్మీకాంతరావు కొంతకాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో రామకృష్ణాపూర్‌కు చెందిన మామిడి శ్రీనివాస్‌తో పరిచయం ఏర్పడింది. అయితే 2019లో లక్ష్మీకాంతరావు, అతడి భార్యతో పాటు మరో నలుగురి పేరిట సీసీసీలోని తీగల్‌పహాడ్ వద్ద ఉన్న ఐదు ఎకరాల 21 గుంటల భూమిని మామిడి శ్రీనివాస్ కొనుగోలు చేశాడు. ఆ సమయంలో రూ.30లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చి అగ్రిమెంట్ చేసుకున్నాడు. అయినప్పటికీ రిజిస్ట్రేషన్ మాత్రం చేయటం లేదు. మిగిలిన వారు రిజిస్ట్రేషన్‌కు సుముఖంగా ఉన్నప్పటికీ లక్ష్మీకాంతరావు మాత్రం దాటవేస్తూ వస్తున్నాడు. దీంతో శ్రీనివాస్ కోపం పెంచుకుని హత్యకు పథకం రచించాడు.

మరో శ్రీనివాస్‌తో కలిసి...

కొంతకాలంగా భూమి రిజిస్ట్రేషన్ పేరిట జాప్యం చేస్తూ వస్తున్న లక్ష్మీకాంతరావును హత్య చేయాలని మామిడి శ్రీనివాస్ నిర్ణయించుకున్నాడు. మంచిర్యాలలోని సంజీవయ్యకాలనీకి చెందిన దాసరి శ్రీనివాస్ సాయం తీసుకున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని లక్ష్మీకాంతరావుకు చెందిన ఓ ప్లాట్‌లో మరో వ్యక్తి సెంట్రింగ్ పనులు చేస్తున్నాడని, దానిని కూలగొడితే రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పడంతో ఈ నెల 11న ఉదయం మామిడి శ్రీనివాస్ దానిని కూలగొట్టడానికి దాసరి శ్రీనివాస్‌తో కలిసి వెళ్లాడు. సెంట్రింగ్ కూలగొట్టి లక్ష్మీకాంతరావుకు అక్కడి నుంచి ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేయాలని కోరాడు. మళ్లీ దాటవేసే సమాధానం చెప్పడంతో ఇక్కడికి వస్తే మాట్లాడుకుందామని లక్ష్మీకాంతరావును రప్పించాడు. అక్కడికి రాగానే దాసరి శ్రీనివాస్‌ను ఎవరూ రాకుండా చూడాలని చెప్పి ప్లాట్ లోపలకి తీసుకెళ్లి కత్తితో లక్ష్మీకాంతరావుపై దాడి చేశాడు. అనంతరం వారు తెచ్చుకున్న ద్విచక్ర వాహనం అక్కడే వదిలి ఇద్దరు శ్రీనివాస్‌లు పారిపోయారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మామిడి శ్రీనివాస్‌ను బస్టాండ్ సమీపంలో గురువారం అరెస్టు చేసినట్లు తెలిపారు. కేసును బెల్లంపల్లి ఏసీపీ సదయ్య ఆధ్వర్యంలో మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐలు అశోక్(రామకృష్ణాపూర్) విజేందర్(దేవాపూర్) త్వరగా ఛేదించడంతో వారిని డీసీపీ అభినందించారు.

హెల్త్ అసిస్టెంట్ ఆత్మహత్య

- నెన్నెల పీహెచ్‌సీలో టాయిలెట్ క్లీనర్ తాగిన కిరణ్‌కుమార్
- బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- డాక్టర్ వేధింపులే కారణమని ఆరోపణలు



కిరణ్ మృతదేహం

నెన్నెల: మండలంలోని మైలారం సబ్ సెంటర్ హెల్త్‌అసిస్టెంట్ వేల్పుల కిరణ్‌కుమార్(46) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. నెన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని బాత్రూంలో టాయిలెట్ క్లీనర్ తాగాడు. 108 అంబులెన్స్‌లో బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. వైద్యాధికారి డాక్టర్ ఝాన్సీరాణి వేధింపులే కారణమని మృతుడి భార్య దీప్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుడి భార్య, పోలీసుల కథనం ప్రకారం.. కిరణ్‌కుమార్ పదేళ్లుగా మైలారం సబ్‌సెంటర్‌లో హెల్త్‌అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. జనవరి 12న రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకున్న తర్వాత ఇటీవల విధుల్లో చేరాడు. ఇతరుల సాయంతో విధులకు హాజరవుతుండగా.. సబ్ సెంటర్‌తోపాటు ప్రతీ గురువారం నెన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ల్యాబ్‌లో విధులు నిర్వర్తించాలని డాక్టర్ సూచించారు. ఆరోగ్యం సహకరించకపోవడంతో ఈ నెల 6న విధులకు హాజరు కాలేదని, 10న వెళ్లిన కిరణ్‌ను సిబ్బంది ఎదుటనే డ్యూటీ చేయడం చేతకాదని, ఇక రానవసరం లేదంటూ డాక్టర్ మందలించిందని కిరణ్‌కుమార్ భార్య దీప్తి ఆరోపించింది. గురువారం విధులకు వెళ్లగా డీఎంహెచ్‌వో నుంచి లెటర్ తెస్తేనే డ్యూటీ చేయాలని చెప్పడంతో మనస్తాపం చెంది బాత్రూం క్లీనింగ్ లిక్విడ్ తాగాడని పేర్కొంది. మెడికల్ ఆఫీసర్ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని ఫోన్ చేసి చెప్పాడని రోదిస్తూ తెలిపింది. ఈ విషయమై డాక్టర్ ఝాన్సీరాణిని సంప్రదించగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతీ గురువారం నెన్నెల పీహెచ్‌సీలో గర్భిణులకు పరీక్షలు ఉంటాయని ఇక్కడే డ్యూటీ చేయమన్నానని చెప్పారు. గురువారం ఎందుకు రాలేదని, సమాచారం ఎందుకు ఇవ్వలేదని సిబ్బంది సమక్షంలో ప్రశ్నించానని, వేధింపులకు గురి చేయలేదని తెలిపారు. కాగా, మృతుడికి భార్య, కూతురు వేరోణిక ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని నెన్నెల ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

న్యాయం చేయాలని మృతదేహంతో ఆందోళన



డీఎంహెచ్‌వోను నిలదీస్తున్న బంధువులు

బెల్లంపల్లి: పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న నెన్నెల మండల కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ వేల్పుల కిరణ్ కుమార్ మృతదేహాన్ని ఆస్పత్రి నుంచి తీసుకెళ్లకుండా గురువారం రాత్రి మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. నెన్నెల పీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ ఝాన్సీ రాణి వేధింపులతోనే కిరణ్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నాడని, వెంటనే ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆసుపత్రి ఆవరణలో బైఠాయించారు. సమాచారం అందుకున్న డీఎంఅండ్ హెచ్ సుబ్బారాయుడు ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబానికి నచ్చచెప్పేందుకు ప్రయత్నించగా బంధువులు నిరాకరించారు. మెడికల్ అధికారినిపై చర్యలు తీసుకోవాలని తన భర్త కిరణ్‌కుమార్ డీఎంహెచ్‌వోకు, డెప్యూటీ డీఎంహెచ్‌వో విజయ పూర్ణిమకు గతంలో ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేరని బుల్యా దీప్తి మండిపడింది. వారిపై సైతం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ క్రమంలో డీఎంహెచ్‌వో అక్కడి నుంచి వెళ్లేందుకు సిద్ధపడగా బాధితులు కారు ఎదుట బైఠాయించారు. బాధితులకు బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు కొయ్యల ఏమాజీ, సీపీఐ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి చంద్రశేఖర్, కాంగ్రెస్ లీగల్ సెల్ రాష్ట్రనాయకుడు ఉదయ్‌కాంత్ సంఘీభావం ప్రకటించి బాసటగా నిలిచారు. దీంతో ఓ దశలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. చివరకు వన్ టౌన్ ఎస్‌హెచ్‌ఓ శంకరయ్య వైద్యాధికారులతో సంప్రదింపులు జరిపి ఆందోళనకు తెరదించేలా కృషి చేశారు. దీంతో జిల్లా వైద్యాధికారులు రూ.40వేలు తక్షణసాయంగా అందించడంతో బాధిత కుటుంబీకులు శాంతించి మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకువెళ్లారు. ఆందోళన రాత్రి 10-30 గంటల వరకు కొనసాగింది. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐలు రాజ్‌కుమార్‌గౌడ్, శంకరయ్య, జగదీష్ పర్యవేక్షించారు.

కాసిపేట2 గనిలో కార్మికుడికి గాయాలు



కార్మికుడిని పరామర్శిస్తున్న జీఎం, నాయకులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట-2 గనిలో గురువారం తెల్లవారు జామున బదిలీ వర్కర్ మెరుగు శ్రీకాంత్ ప్రమాదవశాత్తు కింద పడటంతో చేతి విరిగింది. తోటి కార్మికులకు తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం రాత్రి షిఫ్టులో గురువారం తెల్లవారు జామున ఇండ్‌లెస్(ఎల్ఎస్) కుక్కకట్టె సమయంలో రాడ్ రియాక్షన్‌తో తిరిగి కొట్టడంతో కింద పడిపోయాడు. వెంటనే అతడిని రామకృష్ణపూర్ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో శ్రీకాంత్‌ది కుడిచేయి విరిగిపోయింది. విషయం తెలుసుకున్న ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, రామకృష్ణపూర్ బ్రాంచి కార్యదర్శి అక్బర్‌అలీ, కాసిపేట2 ఫిట్ కార్యదర్శి గోల్ల శ్రీనివాస్, నాయకులు బొడ్డుల వెంకటేష్, లింగమూర్తి ఆస్పత్రిలో గాయాలైన కార్మికుడిని పరామర్శించారు. అలాగే మందమర్రి ఏరియా జీఎం మోహన్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి శ్రీకాంత్‌ను సంఘటనకు జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అతడి వెంట ఏరియా రక్షణాధికారి ఓదెలు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషారాణి ఉన్నారు.

నవోదయ 9వ తరగతి ఫలితాలు విడుదల

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలైనట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. ఐదు ఖాళీ సీట్లకు ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష నిర్వహించగా ప్రతిభ, రిజర్వేషన్‌ల ప్రాతినదిర విద్యాలయ సమితి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఓపెన్ కోటాలో చోలె పార్థ (271024), ఓపెన్ ఎస్సీ కోటాలో కె.వినయ్ (271397), రూరల్‌కోటాలో నోముల ఆశ్మిత (271513), రూరల్ బాలికల ఓబీసీ కోటాలో ప్రీతి (271310), దివ్యాంగుల కోటాలో కె.అభిషేక్ (271281) ఎంపికైనట్లు ఆయన వివరించారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 17న తమ ధ్రువీకరణ పత్రాలతో విద్యాలయానికి రావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ప్రభుత్వ భూమిలో భారీగా మట్టితవ్వకాలు

- రాత్రిపూట టిప్పర్లతో తరలింపు

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామ శివారులో క్రీడా ప్రాంగణం కోసం కేటాయించిన భూమిలో గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి మట్టి తవ్వకాలు జరిపారు. ప్రభుత్వ భూమి (సర్వే నంబర్ 31)లో బొక్కలగుట్ట గ్రామంతో పాటు కోటేశ్వర్‌రావుపల్లె, పులిమడుగు గ్రామాలకు కలిపి కేటాయించిన క్రీడా ప్రాంగణంలో మట్టి తవ్వకాలను స్థానికులు గుర్తించి గురువారం ఉదయం రెవెన్యూ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సంఘటనా స్థలానికి చేరుకుని నిందితులను గుర్తించి నోటీసులు ఇవ్వాలని తహసీల్దార్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఇంత పెద్ద మొత్తంలో మట్టి తవ్వకాలు జరుపుతుంటే ఏం చేస్తున్నారని మండల రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తవ్వకాలు చేపట్టిన వారిపై కేసు నమోదుకు వెనుకాడొద్దని, మైనింగ్ అధికారుల దృష్టికి ఘటనను తీసుకెళ్లాలని సూచించారు. ఆర్డీవో వేణు, ఆర్ఐ నవీత్ తదితరులు ఉన్నారు.

పరీక్ష కేంద్రానికి వీల్‌చైర్‌లో...

మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంబీఏ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు నడుస్తున్నాయి. పరీక్షలు రాసేందుకు పుట్టుకతో రెండు కాళ్లు అంగవైకల్యం కలిగిన మంచిర్యాల పట్టణంలోని హమాలీవాడకు చెందిన సాయికిరణ్‌ఠాకూర్ ములకలలోని కళాశాలలో ఎంబీఏ చదువుతున్నాడు. సాయికిరణ్ తండ్రి హన్మన్ సింగ్ ఆటో డ్రైవర్ కాగా తన ఆటోలో కేంద్రానికి తీసుకొచ్చాడు. గమనించిన కళాశాల ప్రిన్సిపల్ చక్రపాణి విద్యార్థి పరీక్ష కేంద్రానికి వీల్‌చైర్‌లో తీసుకెళ్లాడు. కళాశాల సబార్డినేటర్ మనోజ్‌కుమార్‌ను కళాశాల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.



పరీక్ష కేంద్రానికి తీసుకెళ్తున్న కళాశాల సబార్డినేటర్ మనోజ్‌కుమార్

ఉత్తమ రైతుగా ఆలుగామ వాసి



అవార్డుతో కుమ్మరి కిష్టయ్య

కోటపల్లి: కేంద్రీయ మెట్ట పరిశోధన సంస్థ 39వ ఫౌండేషన్ డే సందర్భంగా మండలంలోని ఆలుగామ గ్రామానికి చెందిన కుమ్మరి కిష్టయ్యకు కేంద్రీయ మెట్ట పరిశోధన సంస్థ డైరెక్టర్ అఫ్ జనరల్ న్యూఢిల్లీ త్రిలోచన్ ముహపాత్ర, డైరెక్టర్ వీకే సింగ్‌లు ఉత్తమ రైతు అవార్డును హైదరాబాద్ బుధవారం అందజేశారు. కుమ్మరి కిష్టయ్య మిర్చి పంటలో అంతరపంటగా వేరుశనగ వేసి అధిక దిగుబడులు పొందడంతో ఈ అవార్డును అందజేసినట్లు సంస్థ నోడల్ ఆఫీసర్ శాస్త్రవేత్త టి.వి ప్రసాద్ తెలిపారు.

ఎస్‌సీఎల్‌యూ కేంద్ర కార్యదర్శిగా శేఖర్



శేఖర్‌కు నియామకపత్రం ఇస్తున్న జనక్ ప్రసాద్

బెల్లంపల్లి: సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) కేంద్ర కార్యదర్శిగా బెల్లంపల్లికి చెందిన ఆరకొండ శేఖర్ నియామకమయ్యారు. ఈ మేరకు గురువారం ఐఎన్‌టీయూసీ సింగరేణి విభాగం సెక్రెటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్ నియామక పత్రాన్ని శేఖర్‌కు అందజేశారు. సింగరేణిలో ఐన్‌టీయూసీని నిర్మాణపరంగా బలోపేతం చేయడానికి, కార్మిక వర్గ సమస్యల పరిష్కారానికి తన వంతు పాత్ర పోషించాలని జనక్‌ప్రసాద్ సూచించారు. తనపై విశ్వాసం ఉంచి కేంద్ర కార్యదర్శిగా నియమించిన అధినాయకులకు శేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

117 క్వార్టర్ల కేటాయింపు

శ్రీరాంపూర్: సీనియారిటీ ఆధారంగా శ్రీరాంపూర్‌లో 117 మంది ఉద్యోగులకు కంపెనీ క్వార్టర్లను కేటాయించారు. గురువారం ప్రగతి మైదానంలో ఈ క్వార్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 187 క్వార్టర్లను కౌన్సెలింగ్‌లో పెట్టగా ఇందులో 117 క్వార్టర్లను ఉద్యోగులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) అరవిందరావు, పీఎం రాజేశ్వర్, ఈఈ గుండె రావు, సీనియర్ పీఓ రాజేశ్వర్‌రావులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులో ఇద్దరికి జైలు

మంచిర్యాలక్రైం: లక్సెట్టిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 2018 అక్టోబర్ 4న నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్ కోర్టు న్యాయమూర్తి ఎం.సతీశ్‌కుమార్ తీర్పునిచ్చారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి.. బాలసాని చంద్రశేఖర్ గౌడ్ నుంచి లక్సెట్టిపేటకు చెందిన పెండం శ్రీలత మాంగళ్య బట్టల దుకాణం రూ.20 లక్షలకు కొనుగోలు చేసి అప్సర సెలక్షన్స్ పేరుతో వ్యాపారం సాగిస్తోంది. ఈ క్రమంలో బిల్డింగ్ యజమానులు ఎంఏ రహీం, ఎంఏ సలీంలకు ఒప్పందం ప్రకారం రూ.18 వేల అద్దె చెల్లిస్తోంది. కొన్ని నెలల తర్వాత అదనంగా కిరాయి చెల్లించాలని బిల్డింగ్ యజమానులు శ్రీలతను వేధించడం ప్రారంభించారు. 2018 ఆగస్టు 24న శ్రీలతను కులం పేరుతో దూషిస్తూ షాపునకు తాళం వేశారు. అనంతరం షాపును మహావీర్ ఎంటర్‌ప్రైజెస్ నరేశ్‌కు అప్పగించారు. బాధితురాలు నరేశ్ వద్దకు వెళ్లి షాపు తాళాలు మీకెవరు ఇచ్చారని ప్రశ్నించింది. గోదాంకు వెళ్లి పరిశీలించగా రూ.ఐదు లక్షల విలువైన చీరలు కనిపించడం లేదని గుర్తించింది. బిల్డింగ్ యజమానులు రహీం, సలీంలపై అనుమానం వ్యక్తం చేస్తూ, అగ్రిమెంట్ కాలం పూర్తి కాకముందే షాపును మరొక్కరికి అప్పగించారని ఆరోపిస్తూ లక్సెట్టిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నిందితులను కోర్టులో హాజరుపర్చగా 17 మంది సాక్ష్యులను విచారించారు. నేరం రుజువు కావడంతో ఎంఏ రహీం, ఎంఏ సలీంలకు ఏడాది జైలు, రూ.1000 జరిమానా విధించారు.

పట్టపగలే దొంగతనం

- ఐదు తులాల బంగారు ఆభరణాలు చోరీ



విచారిస్తున్న సీఐ షాదీక్‌పాషా, ఎస్సై

కౌటాల: మండల కేంద్రంలో గురువారం పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలోని ఓ ఇంట్లో పట్టపగలే దొంగతనం జరిగింది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ వివరాల ప్రకారం.. స్థానిక ప్రగతి కాలనీకి చెందిన ఓ ప్రైవేట్ పాఠశాల హెచ్ఎం దుర్గం గోపాల్, అతడి భార్య సవిత ఏఎన్ఎంగా పని చేస్తున్నారు. గురువారం ఉదయం భార్యాభర్తలు ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. ఈ క్రమంలో దొంగలు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోని 5 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన దంపతులు దొంగలు పడినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి సీఐ షాదీక్ పాషా, ఎస్సై ప్రవీణ్‌కుమార్ చేరుకుని క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. బాధితుడు దుర్గం గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్టు




వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజు, పక్కన ఎస్సై

పెంచికల్‌పేట్: అనుమానంతో భార్యను హత్య చేసిన మురళీగూడ గ్రామానికి చెందిన కామెర శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మురళీగూడ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌కు మహారాష్ట్రలోని దర్వాడకు చెందిన లక్ష్మీతో 18సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. కొంతకాలంగా తాగుడికి బానిసై ఇంట్లో గొడవపడేవాడు. ఇటీవల పిల్లలు బంధువుల ఇంటికి వెళ్లిపోయారు. ఈ నెల 9వ తేదీన భార్యాభర్తలకు వివాదం చోటుచేసుకుంది. మద్యం మత్తులో భార్య లక్ష్మిని తీవ్రంగా కొట్టడంతో మృతిచెందింది. అనంతరం భార్య మూర్ఛవ్యాధితో చనిపోయిందని గ్రామస్తులను నమ్మించే ప్రయత్నం చేయగా మృతురాలి అక్క వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు భర్త శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందులో ఎస్సై విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఓఈ సెట్ ఫలితాల్లో గురుకుల విద్యార్థినులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు సీఓఈ సెట్ -2023 పరీక్ష ఫలితాల్లో విజయం సాధించారు. ఆరుగురు బాలికలు ఉత్తమ మార్కులు సాధించి రాష్ట్రంలోని ప్రఖ్యాత సీఓఈల్లో సీటు దక్కించుకున్నారు. ఇందులో ఇ.అశ్విత (ఎంపీసీ - అల్గనూర్ సీఓఈ), డి.స్వప్న (బైపీసీ - అల్గనూర్ సీఓఈ)లో సీటు కైవసం చేసుకోగా, ఐ.సాయి లిఖిత, సీ.హెచ్ సోనాలి, డి.కల్పన (బైపీసీ - గౌలి దొడ్డి) సీఓఈ లో సీటు దక్కించుకున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ స్వరూప గురువారం తెలిపారు.

ప్రైవేట్ ఆస్పత్రికి అనుమతి ఇవ్వొద్దని ఫిర్యాదు



ఫిర్యాదు పత్రాన్ని అందిస్తున్న సూరిబాబు

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రి ఎదుట నిర్మాణం చేస్తున్న ఓ కమర్షియల్ కాంప్లెక్‌లో ప్రైవేట్ ఆసుపత్రి నిర్వహణకు అనుమతి ఇవ్వవద్దని బెల్లంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమూరి సూరిబాబు గురువారం ఫిర్యాదు చేశారు. షాపింగ్ కాంప్లెక్స్ ప్రభుత్వ భూమిలో ఉందని, కోర్టు ఆదేశాలతో ఓసారి ఆ కాంప్లెక్స్‌ను కూల్చివేయించారని, వివాదంగా మారిన ఆ కాంప్లెక్స్‌లో ప్రైవేట్ ఆసుపత్రిని నిర్వహించడానికి అనుమతి నిరాకరించాలని సూరిబాబు పేర్కొన్నాడు. ఈ మేరకు డీఎంఅండ్‌హెచ్ కార్యాలయంలో ఆయన ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు.